## కేంద్రం చొరవతో..
# కంటోన్మెంట్ బోర్డుకు రూ.303 కోట్లు




**విశ్వంభర, హైదరాబాద్ :** మేడ్చల్ బ్యూరో : 2024 లో జూబ్లీ బస్ స్టేషన్ నుండి శామీర్ పేట వరకు ఎలివేటెడ్ కారిడార్ కి కావలసిన రక్షణ శాఖ భూమిని రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించిందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. అందుకు బదులుగా వచ్చిన 303 కోట్ల రూపాయలను రక్షణ శాఖ కన్సాలిడేటెడ్ ఫండ్ కి జమ చేయాలని అప్పట్లో నిర్ణయించినట్లు తెలిపారు. ఈ మేరకు మంగళవారం కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మదతో కలిసి ఎంపీ ఈటల రాజేందర్ మీడియాతో మాట్లాడారు. కంటోన్మెంట్ బోర్డుకే రూ.303 కోట్ల డబ్బు జమచేయాలని బోర్డు తీర్మానం చేసి లేఖ రాసిందని, నాతోపాటు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కూడా లెటర్స్ రాసినట్లు గుర్తు చేశారు. తాను పార్లమెంట్ లో కూడా ఈ విషయంపై మాట్లాడానని,. శామీర్ పేట ఎలివేటెడ్ కారిడార్ తో పాటు డబుల్ డెక్కర్ బ్రిడ్జి కట్టి మెట్రో, రోడ్డు ఉండేలా చూడాలని కూడా కోరినట్లు తెలిపారు. కంటోన్మెంట్ బోర్డు తీర్మానం చేయడం తోపాటు, ఎంపీగా తాను, కేంద్రమంత్రిగా కిషన్ రెడ్డి రాసిన లేఖలకు స్పందించి కేంద్ర రక్షణ శాఖ రూ. 303 కోట్లు బోర్డు ఖాతాలోనే జమచేసేటట్లు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసిందని ఈటల వెల్లడించారు. దీనితో పాటు 11 కోట్ల రూపాయల గ్రాంట్ కూడా అందించిందన్నారు.

**రూ.160 కోట్లతో.. రెండు స్టామ్ వాటర్ డ్రైన్లు..**

కంటోన్మెంట్ బోర్డు పరిధిలో రూ. 160 కోట్లతో రెండు స్టామ్ వాటర్ డ్రైన్లు నిర్మాణం చేపట్టేందుకు రక్షణ శాఖ మంజూరు చేసినట్లు ఈటల తెలిపారు. ఇందులో ఒకటి జూబ్లీ బస్టాండ్ నుండి ప్యాట్నీ వరకు.. రెండవది రసూల్ పూర బస్తీల మీదుగా.. మంజూరు చేశారని తెలిపారు. ఎస్ ఎన్ డీపీ మాదిరిగా వీటిని నిర్మించనున్నట్లు తెలిపారు. దీంతో కంటోన్మెంట్ లోని బోయినపల్లికి వరద ముంపు నుండి శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. రూ.128 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ సిస్టమ్ కూడా డెవలప్ చేయబోతున్నట్లు తెలిపారు. కంటోన్మెంట్ కి కేంద్రం ఏం ఇచ్చింది అనేవారికి ఇదే మా సమాధానమని, కంటోన్మెంట్ లో పార్కులు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, వరదకాలువలు నిర్మాణం చేయబోతున్నామని స్పష్టంచేశారు.

**కంటోన్మెంట్ సుందరమైన ప్రాంతం..**

కంటోన్మెంట్ ను సుందరమైన ప్రాంతంగా ఈటల అభివర్ణించారు. మిగితా ప్రాంతాలతో పోల్చితే ఇక్కడ వాతావరణం రెండు డిగ్రీల ఉష్ణోగ్రత తక్కువగా ఉంటుందన్నారు. కంటోన్మెంట్ లో డబుల్ బెడ్ రూమ్ లు కూడా నిర్మించేందుకు కూడా ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. సాధారణంగా రక్షణ శాఖ భూములు ఇస్తే అందుకు బదులుగా వచ్చిన నిధులు కేంద్ర రక్షణ శాఖ అకౌంట్ కి జమ అవుతాయి. అలాకాకుండా తొలిసారిగా బోర్డుకు డబ్బులు ఇచ్చినందుకు.. రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ కు, పూర్తి సహకారం అందించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి రాజేందర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కంటోన్మెంట్ బోర్డులో ఎన్నికలు రావాలని, పాలకమండలి కొలువు దీరాలని మేము కూడా కోరుకుంటున్నాం. త్వరలో బోర్డు ఎన్నికలు జరుగుతాయని ఆశిస్తున్నాం. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావిస్తానని ఈటల రాజేందర్ తెలియజేశారు.

# ఈవోలపై దాడిచేస్తే ఊరుకోం..

### ఎండోమెంట్ భూములను కబ్జా చేస్తే పీడీ యాక్టు పెడతాం : మంత్రి కొండా సురేఖ హెచ్చరిక



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** భద్రాచలం ఆలయ ఈవో రమాదేవిపై పురుషోత్తపట్నం గ్రామస్తులు దాడి చేసిన విషయం తెలిసిందే. ఆలయ భూముల ఆక్రమణలను అడ్డుకునేందుకు వెళ్లిన ఈవోపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో రమాదేవి స్పృహ కోల్పోయారు. ఆమెను భద్రాచలం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. తాజాగా ఈ దాడి ఘటనపై రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్పందించారు. దాడిని తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో ఎక్కడైనా... రూల్స్ విరుద్ధంగా ఎండోమెంట్ భూములను కబ్జా చేస్తే పీడీ యాక్టు పెడుతామని హెచ్చరించారు. ఈ విషయంలో గతంలోనూ తాము స్పష్టం చేశామని గుర్తు చేశారు. భద్రాచలం రామాలయ భూములు పురుషోత్తపట్నం(ఏపీ)లో కబ్జాకి గురవుతుండగా అడ్డుకున్న ఈవో రమాదేవిపై దాడి చేయడం సహేతుకం కాదన్నారు. ఈ విషయంలో ఏపీ ప్రభుత్వం, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకొని... సమస్యను పరిష్కారం చేయాలని రిక్వెస్ట్ చేశారు.

బ్యాక్‌గ్రౌండ్ విషయం ఏంటీ?

భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామికి పురుషోత్తపట్నంలో భూములున్న విషయం విదితమే. ఆ భూమిలో అనుమతి లేకుండా భవన నిర్మాణ పనులు చేపడుతుండటంతో భద్రాచలం టెంపుల్ సిబ్బంది దాన్ని అడ్డుకునే క్రమంలో ఆ గ్రామస్థులతో తరచూ ఘర్షణ జరుగుతుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో భద్రాద్రి రాముడికి సుమారు 1,300 ఎకరాల భూమి ఉండగా.. అందులో అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నంలోనే గరిష్ఠంగా 889.5 ఎకరాలు ఉంది. పురుషోత్తపట్నంలోని భూమి ఎక్కువ భాగం ఆక్రమణకు గురైంది. కోర్టు తీర్పు ప్రకారం ఈ భూమిపై దేవస్థానానికి హక్కులు లభించాయి. వీటిని పురుషోత్తపట్నం వాసులు పరిగణనలోకి తీసుకోవటం లేదు. పురుషోత్తపట్నంలోకి ప్రవేశించే మార్గంలో పిల్లర్లతో నిర్మాణ పనులు చేపడుతున్నారనే సమాచారం అందుకున్న ఆలయ సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. అనుమతి లేకుండా ఇళ్ల నిర్మాణం చేయవద్దని, ఇది పూర్తిగా రాముడి భూమి అని వివరించారు. కోర్టు తీర్పులతో దేవుడి పేరిట పట్టాదారు పాసు పుస్తకాలు ఉన్నాయని వెల్లడించారు. అయితే, ఈవో అభ్యంతరాలు వినకుండా... స్థానికులు ఈవోపై దాడి చేశారు. దీంతో ఆమె స్పృహ కోల్పోయిన పరిస్థితి నెలకొంది.

## పోరాట ఫలితంగా జీతాల విడుదల

### తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ప్రకటన విడుదల

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 12వేల గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న సుమారు 60 వేల మంది సిబ్బందికి ఏప్రిల్,మే,జూన్ నెలల వేతన బకాయిలు సుమారు 150 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఇది కార్మిక వర్గం పోరాట విజయంగా తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (టియుసిఐ అనుబంధం) రాష్ట్ర కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. తమ సంఘం, ఆధ్వర్యంలో మండల డివిజన్ జిల్లా రాష్ట్ర స్థాయిలో తమ సంఘం ఆధ్వర్యంలో పోరాడిన ఫలితంగా బకాయి వేతనాలను విడుదల చేసింది. నెల నెలా ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన విధంగా గ్రామ పంచాయతీ ఉద్యోగులకు జీతాలు ఇవ్వాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపెల్లి రవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిమాండ్ చేస్తున్నట్లు ప్రకటనలో తెలిపారు. కనీస వేతనం 26000 ఉండే విధంగా రాష్ట్ర ప్రభుత్వం విధి విధానాలు రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. పోరాడి వేతనాలను విడుదల చేయించుకున్న గ్రామపంచాయతీ సిబ్బంది కి ఐక్యంగా పోరాడి ఏదైనా సాధించవచ్చని మరోసారి నిరూపితమైంది. కార్మిక వర్గం మరింత పట్టుదలతో ఐక్య ఉద్యమాలను చేసి తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

## రాష్ట్రపతికి వార్షిక నివేదిక సమర్పించిన ఎస్సీ కమిషన్



**విశ్వంభర, ఢిల్లీ :** రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు మంగళవారం 202324కు సంబంధించిన తన నివేదికను జాతీయ ఎస్సీ కమిషన్ అందజేసింది. కమిషన్ ఛైర్మన్ కిషోర్ మక్వానా, సభ్యులు వడ్డేపల్లి రామచందర్, లవ్‌కుశ్‌కుమార్, కార్యదర్శి గుడే శ్రీనివాస్ ఆమెను కలిసి నివేదిక ప్రతిని అందించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 338ని అనుసరించి ఎస్సీలకు రాజ్యాంగం కల్పించిన రక్షణకు సంబంధించిన అంశాలను నివేదిక రూపంలో వారు రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లారు. ఎస్సీల రక్షణ, సంక్షేమం, సామాజిక, ఆర్థికాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకోవాల్సిన చర్యల గురించి కమిషన్ సిఫారసులు చేసింది. ఎస్సీలపై వేధింపులు, నేరాల నివారణకు తీసుకుంటున్న చర్యల గురించి ఇందులో సమీక్షించారు. ఎస్సీల సమగ్ర సాధికారతకు తీసుకోవాల్సిన చర్యలను సిఫారసు చేసింది.

## నగదు రహిత వైద్యం అమలు చేయండి

### - రిటైర్డ్ పెన్షనర్ల సంఘం వినతి

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** పెన్షనర్లకు రావలసిన బకాయి సొమ్ములు ప్రతినెలా రూ. 700 కోట్లు చెల్లిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఆ విషయాన్ని విస్మరిస్తోందని, ఈ బకాయిలను వెంటనే చెల్లించాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీ. దామోదర్ రెడ్డి , సెక్రటరీ జనరల్ సీ.చంద్రశేఖర్ లు ప్రభుత్వానికి స్పష్టం చేశారు. గత నెల జూన్ 5 న రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం లో తీసుకున్న నిర్ణయం ప్రకారం పెన్షనర్లకు నగదు రహిత వైద్య సదుపాయాలు అందించాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు ఆసుపత్రులలో ఎక్కడ కూడా నగదు రహిత వైద్యం అందడం లేదని, దీంతో పెన్షనర్లు తమ వైద్యానికి అయ్యే ఖర్చులు భరించలేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, కొంత మంది సకాలంలో చికిత్స అందించుకోలేక మృతి చెందుతున్నారని జీ. దామోదర్‌రెడ్డి, సీ. చంద్రశేఖర్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షనర్ల గెట్‌టుగెదర్ మీటింగ్ మంగళవారం ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా జీ.దామోదర్ రెడ్డి , సీ.చంద్రశేఖర్ లు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులకు సర్కార్ ఇటీవల డీఏ ప్రకటించిన విషయాన్ని ప్రస్తావిస్తూ ఉద్యోగులు , పెన్షనర్లకు రెండు శాతం డీఏ పెంపు దల చేస్తు నిర్ణయం ప్రకటించిందని, ఇది ఉద్యోగులతో పాటు పెన్షనర్లకు ప్రయోజనం కలిగే అంశమేనని అయితే పెంచిన డీఏ వచ్చే జనవరి నుంచి అమల్లోకి వస్తుందని అప్పటి వరకు పెన్షనర్లకు ఆర్థిక సమస్యలు తప్పే పరిస్థితులు లేనట్లు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం ఐదు శాతం మాత్రమే ఐఆర్‌ప్రకటించిన సందర్భంలోనూ సీఎం రేవంత్‌రెడ్డిని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను రెండేసి సార్లు కలిసి బకాయి సొమ్ముల గురించి గుర్తు చేశామన్నారు. ఇప్పటి కైనా ప్రభుత్వం బకాయి సొమ్ము, నగదు రహిత వైద్యం అందించే విషయంలో సానుకూలంగా స్పందించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి పెంటయ్య, రాష్ట్ర నాయకులు శ్యాం రావు, గంగా రెడ్డి, శంకర్ రెడ్డి , ప్రహ్లాద రావు తో పాటు ఖమ్మం, నల్గొండ, కరీంనగర్, సిరిసిల్ల, నిర్మల్, రంగారెడ్డి జిల్లాల పెన్షనర్‌సంఘ అధ్యక్షులు పాల్గొన్నారు. కాగా జీ. దామోదర్‌రెడ్డి బర్త్‌డే ను పురస్కరించుకుని ఆయన్ను శాలువతో సన్మానించారు.

# పేదల ప్రగతే.. ప్రజల ప్రగతి : సీతక్క



**విశ్వంభర, కేసముద్రం :** కేసముద్రం మండల కేంద్రంలో జరిగిన ప్రజా పాలన ప్రగతి బాట కార్యక్రమంలో వేదికపై నుంచి పంచాయతీ రాజ్, స్త్రీ శిశు సంక్షేమ,గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ ముందుగా గిరిజనుల సీతల భవాని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో అత్యంత వైభవంగా నిధుల వరద పనుల జాతర జరుగుతుందని కొనియాడారు. 20 ఏళ్ల తర్వాత ఈ రాష్ట్రంలో పుట్టిన అభివృద్ధి చేసుకునే అవకాశం దక్కిందని వేం నరేందర్ రెడ్డి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మహబూబాబాద్ నియోజకవర్గంలో అన్ని విధాలు అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ అంటేనే పేదల ప్రగతి ప్రజల ప్రగతి అని సంక్షేమం అభివృద్ధి పేదలను అన్ని రంగాల అభివృద్ధి చేయడం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని అన్నారు. నాడు ఇందిరమ్మ పేదల అందరికీ సంక్షేమ పథకాల ముఖ్య ఉద్దేశంతో పనులు చేసిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ మార్గంలో నడుస్తూ ప్రతి పేదవాడు కడుపునిండా సన్న బియ్యంతో తింటున్నానంటే దానికి కారణం మన ముఖ్యమంత్రని అన్నారు. పేద ప్రజలకు ఇందిరమ్మ ఇల్లులు ఇచ్చి ప్రతి ఒక్కరికి ఇంటి అవకాశం కల్పించాలని రాష్ట్రవ్యాప్తంగా నాలుగు లక్షల 50 వేల ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేశారు. గతంలో ఎస్సీ ఎస్టీ బీసీ వాడల్లో కరెంటు బిల్లులు కట్టకుంటే కరెంటు కట్ చేసే వారని వారంతా చీకటిలో మగ్గిపోయారని మన ప్రజా పాలనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాగానే ప్రతి కుటుంబానికి రెండు వందల యూనిట్లు ఫ్రీ కరెంటు ఇస్తున్నాడని గుర్తు చేశారు వరి వేస్తే ఉరి అన్న గత ప్రభుత్వం నేడు ప్రజా పనుల ముఖ్యమంత్రి వరి రైతులకు 500 రూపాయలు కొనుగోలు చేశారన్నారు. మహబూబాబాద్ నియోజకవర్గం అదేవిధంగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ నుంచి భారీ స్థాయిలో నిధులు ఇవ్వడం జరిగిందని అన్నారు. మహిళలు ఆర్థిక సాధికారత లభించాలంటే మహిళా సంఘాల్లో సభ్యులుగా ఉండాలని ఇప్పటికే 25 వేల కోట్ల రూపాయలు వడ్డీ లేని రుణాలు అందించామని ఇంకా ఈ నెలలో మిగిలిన నిధులను మంచిది చేయడమే కాకుండా వడ్డీ లేని అందించడానికి లింకేజీలను అందిస్తామని అన్నారు. కేసముద్రం మండలంలో ఇందిరా శక్తి భవనం మూడు కోట్ల రూపాయలతో నిర్మించుకుంటామని అన్నారు.



వైశ్య రణభేరి పోస్టర్‌ను ఆవిష్కరించిన జడ్చర్ల మున్సిపల్ వైస్ ఛైర్మన్ పలాది రామ్మోహన్‌గుప్త. కార్యక్రమంలో వైశ్యవికాసవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు డా.కాచం సత్యనారాయణ గుప్త, బుక్కా ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.



## మేడిగడ్డ బ్యారేజీకి 1.18 లక్షల క్యూసెక్కుల నీటి ప్రవాహం

### సమ్మక్క బ్యారేజీ 38 గేట్లు ఎత్తివేత

**విశ్వంభర, మహదేవపూర్:** మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం భారీగా పెరిగింది. ఎగువ నుంచి 1,18,850 క్యూసెక్కుల నీరు వస్తుండడంతో 85 గేట్ల నుంచి దిగువకు వదులుతున్నారు. బ్యారేజీ సామర్థ్యం 16.17 టీఎంసీలు కాగా.. ఏడో బ్లాక్ దెబ్బతిన్నప్పటి నుంచి నీటిని నిల్వ చేయడం లేదు. మరోవైపు గోదావరికి వరద ప్రవాహం పెరగడంతో ములుగు జిల్లా తుపాకుల గూడెంలోని సమ్మక్కసాగర్ బ్యారేజీ వద్ద 38 గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నట్లు నీటిపారుదల శాఖ డీఈఈ శరత్‌బాబు, ఏఈఈ సాయిరాం తెలిపారు. దేవాదుల ఇన్‌టేక్‌వెల్ వద్ద నాలుగు పంపులతో నీటి పంపింగ్ కొనసాగుతోంది. బ్యారేజీలో 83 మీటర్ల నీటిమట్టానికి గాను 79.95 మీటర్ల మేర నీరు ఉంది. 6.94 టీఎంసీలకు గాను 4.143 టీఎంసీల నిల్వ ఉంది. ఎగువ నుంచి బ్యారేజీకి 2,35,680 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతుండగా.. 2,92,450 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ఇన్‌టేక్‌వెల్ నుంచి ఫేజ్ 2లో రెండు, ఫేజ్ 3లో రెండు.. మొత్తం నాలుగు పంపుల ద్వారా 1,078 క్యూసెక్కుల నీటిని భీంఘనపూర్ రిజర్వాయర్‌లోకి పంపిణీ చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

## కల్వకుంట్ల ఫ్యామిలీకి మతి చెడింది : మైనంపల్లి రోహిత్



**విశ్వంభర, మెదక్ :** మెదక్ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకుడు మైనంపల్లి రోహిత్ బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ కుటుంబం యొక్క మానసిక పరిస్థితి సరిగా లేదని వ్యాఖ్యానించారు. వారి కుటుంబంలోనే గొడవలు జరుగుతుంటే ఇక ప్రజలను ఎలా పట్టించుకుంటారని విమర్శించారు. ఆ బాధతోనే కేసీఆర్ ఫాంహౌస్ దాటి బయటకు రావడం లేదని, తరచూ అనారోగ్యం పాలవుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ 'ఖేల్ ఖతం, దుకాణం బంద్' అయిందని, ఇక వారు తట్టా బుట్టా సర్దుకోవాల్సిందేనని తెలిపారు. గత 10 ఏళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రాన్ని దోచుకోవడం, దాచుకోవడం తప్ప ప్రజల గురించి పట్టించుకోలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ బహిష్కరించిన నాయకులను బీఆర్‌ఎస్ చేర్చుకుని గొప్పలు చెప్పుకుంటోందని విమర్శించారు. కాగా ఇటీవల మెదక్ నుంచి భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్ పార్టీ అగ్రనేతలు హరీష్ రావు, కేటీఆర్ సమక్షంలో గులాబీ పార్టీలోకి చేరారు. ఈ క్రమంలోనే మైనంపల్లి హనుమంత రావు, రోహిత్ బీఆర్‌ఎస్ నాయకులపై తీవ్ర వ్యాఖ్యలు చేస్తున్నారని రాజకీయాల్లో చర్చ నడుస్తోంది.



గాంధీ భవన్‌లో దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించిన టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్. ఈ కార్యక్రమం లో ఎమ్మెల్యే దానం నాగేందర్,, శ్రీ గణేష్, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బలమూరి వెంకట్, వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్ కుమార్ యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

- విశ్వంభర, హైదరాబాద్

## నీటి విడుదల బీఆర్ఎస్ విజయమే: హరీశ్‌రావు

**విశ్వంభర, హైదరాబాద్:** ఎట్టకేలకు కల్వకుర్తి మోటార్లు ఆన్ చేసి నీటిని విడుదల చేయడం బీఆర్ఎస్, కేసీఆర్‌ల విజయమేనని మాజీ మంత్రి హరీశ్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ''బీఆర్ఎస్ పార్టీ నిలదీస్తే గానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో కదలిక రాదా? మేం ప్రశ్నిస్తే తప్ప అన్నదాతల నీటి సమస్యలు గుర్తుకు రావా? లక్షల మంది రైతులతో తరలివచ్చి మోటార్లు ఆన్ చేస్తామంటే గానీ చలనం ఉండదా? ఎగువ రాష్ట్రాల నుంచి వస్తున్న వరదను ఒడిసిపట్టాల్సింది పోయి... విడిచిపెట్టడం దుర్మార్గం. ఇకనైనా రాజకీయ కక్షసాధింపు చర్యలపై కాకుండా రైతులపై దృష్టి సారించండి. కల్వకుర్తి మాదిరే కాళేశ్వరం మోటార్లను ఆన్ చేసి, రిజర్వాయర్లు నింపి... పొలాలకు నీళ్లు మళ్లించాలని భారాస పక్షాన డిమాండ్ చేస్తున్నాం'' అని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఉపాధి హామీ ఏపీవోలకు మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం శోచనీయమని మరో ప్రకటనలో ఆయన విమర్శించారు. ''చేసిన పనికి వేతనాలు రాక.. ఉపాధి హామీ సిబ్బంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ.. కుటుంబ పోషణ భారమై సతమతమవుతుంటే రాష్ట్ర ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరించడం దుర్మార్గం. మరోవైపు పారిశుద్ధ్య కార్మికులకు సైతం వేతనాలు రాక గ్రామాల్లో పరిశుభ్రత పడకేసింది. ప్రభుత్వం తక్షణమే స్పందించి... ఉపాధి హామీ ఏపీవోలు, పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలి'' అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.